వినూత్న ఆవిష్కరణలపై దృష్టిసారించాలి

నూతనంగా తయారు చేసిన వస్త్రాన్ని ఎమ్మెల్యేకు అందజేస్తున్న యువకులు

• ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, జూలై 29 : ఉన్నత చదువులు అభ్యసించి ప్రయోగాత్మక ఆలోచనలు కలిగిన యువకులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా కేంద్రానికి చెందిన యువకులు వేముల ప్రవీణ్, ఓంప్రకాశ్ పంటలకు చీడపీడల నివారణ కోసం రసాయనాలను పిచికారీ చేసే సమయంలో రైతుల శరీర రక్షణ కోసం తయారు చేసిన ప్రత్యేక వస్త్రాన్ని ఎమ్మెల్యేకు అందజేస్తూ దాని ప్రత్యేకతను వివరించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ కంపెనీ తరపున ఒక ప్రత్యేక వస్త్రాన్ని తయారు చేస్తున్నామని అందుకు సహకారం కావాలని యువకులు ఎమ్మెల్యేను కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. యువత నూతన ఆలోచనలు కలిగి వినూత్న ఆవిష్కరణలపై యువత దృష్టి సారించాలని పేర్కొన్నారు.

పారిపోయిన బాలుడు తల్లిదండ్రుల చెంతకు..



విజయ్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కేటీదొడ్డి పోలీసులు

కేటీదొడ్డి, జూలై 29 : చెడు వ్యసనాలకు అలవాటు పడిన కొడుకుని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో నుంచి బాలుడు పారిపోయిన ఘటన మండలంలోని మల్లాపురం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు కథనం ప్రకారం మల్లాపురం తండాకు చెందిన గంగానాయక్ కొడుకు 17 ఏండ్ల విజయ్ చెడు వ్యసనాలకు బానియ్యాడు. దీంతో తల్లిదండ్రులు అతడిని మందలించడంతో ఆత్మహత్య చేసుకుంటానని ఇంట్లో నుంచి పారిపోయాడు. తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతకగా కనబడలేదు. వారికి ఏం చేయాలో అర్థంకాక అర్ధరాత్రి ఒంటి గంటకు 100 నెంబర్‌కు ఫోన్ చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు విజయ్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. విజయ్‌కు అవగాహన కల్పించి సోమవారం ఉదయం తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులకు విజయ్ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

చెరుకు రైతులకు బోనస్ ప్రకటించాలి

•ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్

అమరచింత, జూలై 29: చెరుకు రైతులకు రూ.వెయ్యి బోనస్‌ను ప్రకటించాలని చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు కంకలి రాజన్న, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చెరుకు రైతులు పంట దిగుబడులు, సరైన గిట్టుబాటు ధర ఇబ్బందులు పడుతున్నారని వరికి రూ.500 బోనస్ ప్రకటించినట్లు చెరుకు పంటకు రూ.వెయ్యి బోనస్ ప్రకటించాలని కోరారు. మంగళవారం సీఎంని కలిసి చెరుకు రైతుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో చెరుకు రైతులు తిమ్మారెడ్డి, చారి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రుణమాఫీకి తప్పని తిప్పలు

అమరచింత యూనియన్ బ్యాంకులో రైతులు

అమరచింత, జూలై 29 : కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలోపు రైతులకు రుణమాఫీని చేస్తున్నట్లు జూన్18వ తేదీ ప్రకటించింది. అయితే తమకు రుణమాఫీ అయ్యిందో లేదో తెలుసుకోవడానికి రైతులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇప్పటికీ పది రోజులు గడుస్తున్నా అధికారులు రైతులకు సరైన సమాచారం తెలపక వ్యవసాయ పనులను వదులకొని ప్రతి రోజూ బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

బహుభాషా కోవిదుడు సీనారె

సీనారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు

వనపర్తి టౌన్, జూలై 29: సాహితీ సౌరభం, బహుభాషా కోవిదుడు సింగిరెడ్డి నారాయణరెడ్డి అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాంప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సినారె 93వ జయంతి వేడుకలను ఉద్యోగ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాహిత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు సినారె అని అన్నారు. నిజాం కళాశాల ఉస్మానియా కళాశాలలో ఆచార్యులుగా వేలమంది విద్యార్థులకు తెలుగు సాహిత్యాన్ని అందించిన గొప్ప వ్యక్త అని కొనాయాడారు. 50 ఏండ్ల పాటు సినీ రంగంలో వేలాది పాటలు రాసి జ్ఞానపీఠ పురస్కారం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులను అందుకున్నారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కవి పండితుడు బూరోజు గిరిరాజాచారి, ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు మండ్ల దేవన్ననాయుడు, బాలేమియా, రాంబాబు, వెంకటస్వామి, బీచుపల్లి, శివశంకర్ ఉన్నారు.

చెప్పులు కుట్టే కార్మికులను ఆదుకోవాలి

వనపర్తి టౌన్, జూలై 29 : వనపర్తిలో ఎన్నో ఏండ్లుగా రోడ్ల పక్కన చెప్పులు కుట్టే వృత్తిపై జీవిస్తున్న కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో స్నేహా పుట్‌పాత్ వర్కర్స్ సెంటర్‌లో చెప్పులు కుట్టే కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వనపర్తి పట్టణంలో రాజీవ్ చౌక్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, కొత్త బస్టాండ్ , గాంధీచౌక్ తదితర ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెప్పులు కుడుతూ జీవిస్తున్నారన్నారు. చాలీచాలని ఆదాయంతో దుర్భర జీవితం గడుపుతున్నారని ఆదుకోవలసిన అవసరం ఉందన్నారు. వారికి పనిముట్లు, ముడి సరుకు బ్యాంకుల నుంచి రుణం ఇవ్వాలన్నారు. ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ప్రతి నెలా రూ.6వేల పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రమేశ్, నాయకులు శాంతన్న, నజీర్, వెంకటేశ్వర్లు, బాలయ్య ఉన్నారు.

మాట్లాడుతున్న ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ

కూలేందుకు సిద్ధం

• శిథిలావస్థకు చేరిన కోటబురుజు • కనుమరుగవుతున్న చారిత్రక కట్టడాలు

మల్దకల్, జూలై 29: అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో చారిత్రాత్మక కట్టడాలు ఒక్కొక్కటిగా కనుమరుగు అవుతున్నాయి. ఇందుకు ఉదాహరణే మండలంలోని పెద్దొడ్డి గ్రామంలో వందల ఏండ్ల కిందట గద్వాల రాజులు నిర్మించిన రాతి బురుజు కోట కూలడానికి సిద్ధంగా ఉంది. అప్పటి గద్వాల మహారాజు నల్లసోమనాద్రి ఆధ్వర్యంలో గ్రామంలో నడిబోడ్డున ఈ రాతి బురుజు కోటను నిర్మించారు. ఆది గ్రామానికే చిహ్నంగా మారింది. కాగా కొన్ని ఏండ్లుగా వర్షాలకు బురుజుకు ఉన్న రాళ్లు పడిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి రాతి బురుజు కోటకు మరమ్మతులు చేపట్టిన మన చరిత్రకు తార్కాణంగా నిలిచిన కట్టడాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

పెద్దొడ్డిలో కూలడానికి సిద్ధంగా ఉన్న రాతిబురుజు కోట

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ గిరిధర్

అమరచింత, జూలై 29 : జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద నేపథ్యంలో నదీతీర ప్రాంతాల ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గిరిధర్ సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన జూరాల ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టుకు వస్తున్న వరద, దిగువకు వదులుతున్న నీటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆత్మకూర్ సీఐ శివకుమార్, అమరచింత, ఆత్మకూర్ ఎస్సైలు సురేశ్, నరేందర్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, జూలై 29 : వనపర్తి సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కళాశాల ప్రిన్సిపాల్ అరుణ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంజెడ్సీ, బీజెడ్సీ, బీఏ, బీకాం జనరల్ కోర్సుల్లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్ల తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లకు ఎస్సీ కేటగిరి విద్యార్థినులు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థినులు జిల్లా కేంద్రంలోని నాగవరం తండా సమీపంలో ఉన్న అనుస్ ఎడ్యుకేషన్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జూలై 31వ తేదీలోగా సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పాఠ్య పుస్తకాలు విడుదల చేయాలి

గద్వాల అర్బన్, జూలై 29 : ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పెండింగ్‌లో ఉన్న పాఠ్య పుస్తకాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ శివకుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 8 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయని, వీటిలో 40శాతానికి పైగా విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందజేయలేదన్నారు. అధికంగా ఇంగ్లిష్ మీడియం పుస్తకాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయంపై తక్షణమే స్పందించి పాఠ్య పుస్తకాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పాన్‌గల్, జూలై 29 : మండలంలోని కేతేపల్లి గ్రామానికి చెందిన బక్కన్న(78) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ రవి బాధితుడి ఇంటికెళ్లి పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వారి వెంట నాయకులు శ్రీనివాసులు, వెంకటేశ్ ఉన్నారు.

హామీలు విస్మరించిన కాంగ్రెస్

పాన్‌గల్,జూలై29: ఎన్నికల్లో మోసపూరిత ఎన్నికల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ హామీలు విస్మరించిందని బీజేపీ నియోజకవర్గ నాయకులు సంగనమోని అన్వేశ్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు కేటాయించిన బడ్జెట్‌కు పొంతనలేదని విమర్శించారు. రుణమాఫీలో చాలామంది రైతులను తప్పించారని, రైతు భరోసా, పింఛన్ పెంపు, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇంతవరకు మొదలు పెట్టలేదన్నారు.

చలో ఢిల్లీ కరపత్రం విడుదల

వనపర్తి టౌన్, జూలై 29 : జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సోమవారం టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కరపత్రాలను టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాములు, జిల్లా అధ్యక్షులు మీసాల వీరస్వామి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 6,7వ తేదీల్లో మాదిగ హక్కుల కోసం చలో ఢిల్లీ, దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దీక్షకు టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు , రాష్ట్ర అధ్యక్షుడు శిరసానోళ్ల బాలరాజులు పాల్గొంటారని చెప్పారు. జిల్లాలోని ఎమ్మార్పీఎస్ నేతలు, మండలాల అధ్యక్షులు, సభ్యులు అధిక సంఖ్యలో తరలివచ్చి చలో ఢిల్లీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

జ్వర పీడితులకు చికిత్సలు

పెబ్బేరు, జూలై 29 : పెబ్బేరు పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం మండలంలోని శాఖాపురంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్తులు జ్వరాలతో బాధపడుతున్నారన్న సమాచారంతో వారు గ్రామంలో పర్యటించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్యశిబిరంలో చికిత్సలు అందించారు. ఇంటింటికీ తిరిగి జ్వర పీడితులను గుర్తించి, వారి నుంచి రక్తనమూనాలను సేకరించారు. గ్రామంలో ప్రతి రోజు ఫీవర్ సర్వే చేపట్టనున్నట్లు వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు.

శాఖాపురంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరం

ర్యాలంపాడు రిజర్వాయర్ పనులను పూర్తిచేయాలి

గద్వాల అర్బన్, జూలై 29 : ర్యాలంపాడు రిజర్వాయర్ పెండింగ్ పనులను తక్షణమే పూర్తిచేసి నిర్ణీత 4టీఎంసీల సామర్థ్యం పెంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆదేశాల మేరకు..సోమవారం ధరూర్ మండలంలోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తిచేస్తే రిజర్వాయర్‌లో 4టీఎంసీల నీరు నింపే అవకాశం ఉందని, ప్రస్తుతం 1 టీఎంసీ నీరుకే రిజర్వాయర్ పరిమితమైందన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి సారించి తక్షణమే ర్యాలంపాడు రిజర్వాయర్ పెండింగ్ పనులు పూర్తి చేసి 4 టీఎంసీల సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, శివారెడ్డి, మధుసూదన్, కిష్టన్న, అనిల్, జనార్ధన్ రెడ్డి, రాముడు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబను దర్శించుకున్న బీఆర్ఎస్ నాయకులు

అలంపూర్, జూలై 29: జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను బీఆర్ఎస్ నాయకులు చల్లా అగస్త్య రెడ్డి, హరిచంద్రారెడ్డి, ర్యాలంపాడు సర్దార్‌బాషా సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయాల్లో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో అర్చనలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం అర్చకులు శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారివెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు

అట్టహాసంగా గోరింటాకు వేడుకలు

వనపర్తి టౌన్, జూలై 29 : ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకుంటే మహిళలకు ఆరోగ్యం, సౌభాగ్యం కలుగుతాయనేది మహిళాల నమ్మకం. ప్రతి ఏడాది వచ్చే ఆషాఢమాసంలో గోరింటాకు పండుగను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే జిల్లా కేంద్రంలో సోమవారం పద్మశాలి సంఘం అధ్యక్షురాలు చెన్నపద్మ ఆధ్వర్యంలో మహిళలతో కలిసి గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోరింటాకు పెట్టుకోవడం వలన అధిక ఉష్ణాన్ని తగ్గించి గర్భాశయ దోషాలు, బాధలు తగ్గిపోతాయని, బాలింతలకు డెలివరీ తర్వాత గోరింటాకు ముద్దలు ఇవ్వడం వల్ల ప్రసవం వల్ల కలిగే బాధలు తగ్గిపోతాయని చెన్నపద్మ మహిళలకు సూచించారు. కార్యక్రమంలో మహిళలు నందిమల్ల శారద, గంజి రత్నమ్మ, కెంచె భాగ్యమ్మ, తిరుమల సక్కుబాయి, సారంగ శిరీష, లక్ష్మి, సరిత, శ్రీదేవి, స్వాతి, పట్టణ పద్మశాలీ సంఘం కార్యకర్తం , జిల్లా పద్మశాలి సంఘం కార్యవర్గం పాల్గొన్నారు.

గోరింటాకు వేడుకలో పాల్గొన్న మహిళలు

భక్తిశ్రద్ధలతో కౌడిపీర్ల నిమజ్జనం

ఆత్మకూరు, జూలై 29: పట్టణంలోని భరత్‌నగర్‌లో ఏర్పాటుచేసిన కౌడిపీరీల నిమజ్జనోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పీరీల చావిడి వద్ద పీర్లకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం నిమజ్జనోత్సవాన్ని తరలించారు. చావిడిలో ప్రతిష్ఠించిన మౌలాలీ, హుస్సేన్ ఆలం, హసేన్ ఆలం, ఇమామే ఖాషీమ్, ఇమామే జలాల్ పీర్లను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. నిర్వాహకుడు గౌస్ నేతృత్వంలో పీర్ల ఊరేగింపు ప్రారంభం కాగా భక్తులు దట్టీలు కట్టి కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో గౌస్, శ్రీనివాసులు, జాహంగీర్, మోయిన్, కటికె అశోక్, రఘు, వెంకటేశ్, బాలరాజు, మోహన్, పండు, మహేశ్ పాల్గొన్నారు.

కనుల పండుగగా సాగుతున్న పీర్ల నిమజ్జనోత్సవం

పల్లెపాడు శివారులో పంట పొలాల్లోకి చేరుకున్న వరద

నీట మునిగిన పంట పొలాలు

మానవపాడు, జూలై 29: కృష్ణానది పరివాహక ప్రాంతమైన పల్లెపాడు శివారులోని పంట పొలాలు నీట మునిగాయి. కృష్ణా పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో భారీ వరద చేరుతున్నది. దీంతో శ్రీశైలం బ్యాక్ వాటర్ ఎక్కువ కావడంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. ఇప్పటికే 50ఎకరాల పంట నీట మునిగింది. మరో రెండురోజులు ఇలా వరద కొనసాగితే మరికొంత పంట పొలాలు నీట మునిగే అవకాశం ఉందని గ్రామస్తులు అంటున్నారు.

ఇంట్లోకి చొరబడి నగదు అపహరణ

గోపాల్‌పేట, జూలై 29 : గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి నగదు అపహరించారు. ఎస్సై తిరుపతిరెడ్డి కథనం మేరకు.. రేవల్లి మండలంలోని శానాయిపల్లి గ్రామానికి చెందిన బగుణమ్మ ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువా తాళం ధ్వంసం చేసి అందులో ఉన్న రూ. 80 వేలు చోరీ చేశారు. పాత మట్టి మిద్దె బలహీనంగా ఉండటం, వానలు కురుస్తుండటంతో బగుణమ్మ ఆమె భర్త శ్రీశైలం రాత్రి పూట పక్కనే ఉన్న వారి బంధువుల ఇంట్లో పడుకొంటున్నారు. ఇది అదునుగా తీసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డట్లు ఎస్సై తెలిపాడు. బాధితురాలు ఫిర్యాదు ఘటనా స్థలాన్ని పరిశీలించిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చిన్నంబావి, జూలై 29 : పెరుగుతున్న సాంకేతికతను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పబ్బతి రమేశ్ అన్నారు. మండలంలోని బెక్కెం గ్రామంలో సైబర్ నేరాలపై సోమవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫోన్లకు లింక్‌లు పంపిస్తారని వాటిని క్లిక్ చేయకూడదన్నారు. ప్రస్తుతం యువత ఎక్కువగా సైబర్ నేరాల బారిన పడుతున్నారని, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేందుకు గ్రామస్తులు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

బెక్కెంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై రమేశ్

మతోన్మాదం, మూఢనమ్మకాలకు అడ్డుకట్ట వేయాలి

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

వనపర్తి, జూలై 29(నమస్తే తెలంగాణ) : మితిమీరుతున్న మతోన్మాదం, మూఢనమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని, అలాగే బీజేపీ చేస్తున్న కుట్రలపై మరింతగా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పుట్టా ఆంజనేయులు, బాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ బీజేపీ అధికారమే పరమావధిగా పని చేస్తున్నదని, మనుస్మృతి చట్టాలను అమలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. కులవాదాన్ని రక్షించి, నిచ్చెలా కుల సిద్ధాంతాన్ని అమలు చేయటమే బీజేపీ లక్ష్యమన్నారు. రిజర్వేషన్లు ఎత్తేయాలని బీజేపీ ఆలోచిస్తున్నదని, తమ లక్ష్యాలను నెరవేర్చటానికి అంబేద్కర్ అధ్యక్షతన రూపొందించిన రాజ్యాంగం ఆటంకంగా ఉందని బీజేపీ ఆలోచిస్తున్నదన్నారు. దీని తొలగింపు కోసం పార్లమెంట్‌లో మెజార్టీ కావాలంటూ మొన్నటి ఎన్నికల్లో 370సీట్ల లక్ష్యంగా ప్రచారం చేశారన్నారు. బీజేపీ అనుకున్నట్లు రాజ్యాంగాన్ని మార్చివేస్తే దేశం..దేశంగా ఉండదని జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ మనుస్మృతి ఆధారంగా మూఢ నమ్మకాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైనాన్ని నైపుణ్యంతో,వాస్తవాల ఆధారంగా ప్రజలకు అర్థం చేయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు మహమూద్, నాగిరెడ్డి, ఉమా, పట్టణ కార్యదర్శి కురుమయ్య పాల్గొన్నారు.

విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్ వెస్లీ

ప్రజా వ్యతిరేక బడ్జెట్

గద్వాల అర్బన్, జూలై 29 : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు ఇక్బాల్ పాషా పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల బతుకులను బలిచేసే బడ్జెట్ అని, మధ్య తరగతి, నిరుద్యోగులు, విద్యార్థులను నిలువునా ముంచిన బడ్జెట్ అని విమర్శించారు. ప్రజలను దోచి సంపన్నులకు దేశ సంపద ధారాదత్తం చేసే దుర్మార్గమైన బడ్జెట్ అన్నారు. కార్యక్రమంలో సభ్యులు గోపాల్ రావు, రామిరెడ్డి, గోపాల్ యాదవ్, సత్యారెడ్డి, దేవదాసు, రాముడు, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

గోపాల్‌పేట, జూలై 29: మండలకేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన దాసరి బుచ్చన్న (65)అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. బీఆర్ఎస్ మండల మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు కరోళ్ల స్వప్న రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్‌రాజు నాయకులు గోపాల్, మన్యం నాయక్, సత్యనారాయణ, కాశీనాథ్, రాజేశ్‌గౌడ్, రత్నయ్య తదితరులు ఉన్నారు.

పూజారికి నివాళి

గద్వాల రూరల్, జూలై 29 : నడిగడ్డ ఇలవేల్పు జములమ్మ ఆలయంలో పూజలు నిర్వహించే పూజారి లచ్చగౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి సోమవారం బాధితుడి ఇంటికి వెళ్లి లచ్చగౌడ్ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

ఖిల్లాఘణపురం, జూలై 29 : చోరీ కేసును పోలీసులు ఛేదించిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. కొత్తకోట సీఐ రాంబాబు కథనం ప్రకారం.. మండలంలోని వెంకటాంపల్లికి చెందిన బోయ పార్వతమ్మ పొలం పనుల నిమిత్తం రూ.లక్షా40వేలను తన సోదరుడు నాగేశ్ ఇంట్లో ఇనుప పెట్టెలో దాచి ఉంచింది. ఆదివారం పొలం పనులకు వెళ్లగా నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానితుడిగా చిలుక చెన్నయ్యను సోమవారం కస్టడీలోకి తీసుకొని విచారించారు. చెన్నయ్య నేరం ఒప్పుకొని తనవద్ద దాచుకున్న రూ.లక్షా38వేలు చూపించగా నగదును సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. కేసును త్వరగా చేధించడంలో ప్రతిభ చూపిన ఖిల్లా ఎస్సై శ్రీహరిని, ఏఎస్సై నాగరాజు, హెడ్ కానిస్టేబుళ్లు బద్రీనాయక్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు ఆ